గుండెపోటుతో 'మల్లన్న' ఆలయ ఉద్యోగి మృతి

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు, సిబ్బంది

చేర్యాల, జూన్ 22 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఉద్యోగి శ్రీపతి తిరుపతి గౌడ్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం ఆయన స్వగ్రామమైన వరంగల్ జిల్లా మొగుళ్లపల్లిలో అంతిమ సంస్కారాలు జరిగాయి. ఆలయ ఉద్యోగి మృతిపై ఈవో ఎ.బాలాజీ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు దేవాదాయ శాఖ నుంచి వచ్చే బెనిఫిట్స్‌ను త్వరగా అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా తిరుపతిగౌడ్ భౌతికకాయానికి పూల మాల వేసి ఆలయ ఉద్యోగులు నివాళులర్పించడంతో పాటు మృతుడి కుటుంబానికి ఆలయం నుంచి ఉద్యోగులు రూ.20వేలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది సందీప్, విజయ్‌కుమార్, కనకయ్య, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో అన్నదానం

హుస్నాబాద్‌లో అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యమహిళా సంఘం సభ్యులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 22: ప్రతి ఇంటి నుంచి నిత్యం అందించే పిడికెడు బియ్యంతో ఎంతోమంది పేదల ఆకలిని తీర్చగలుగుతామని ఆర్యవైశ్యమహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత అన్నారు. హుస్నాబాద్ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. పలువురు మహిళలు రోజూ అందించే పిడికెడు బియ్యం, యాభైరూపాయలను ఒక చోట చేర్చి ప్రతినెలా పౌర్ణమిరోజు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. పదిమంది ఆకలితీర్చేందుకు మహిళలు ముందుకు రావడం అభినందనీయమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ చిత్తారి పద్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, కైలాసం, తనుకు ఆంజనేయులు, రవీందర్ పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై విచారణ జరిపించాలి

హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్ యూత్ నాయకులు

హుస్నాబాద్, జూన్ 22: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యూత్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు మొత్తుకున్నా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. పేపర్ లీకేజీ వల్ల కష్టపడి చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. కేంద్రం విధానాల వల్ల దేశంలోని 25లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని, విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకులు చిరంజీవి, సతీశ్, జీవన్, భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, సునీత, లక్ష్మి, పద్మ, బాలయ్య పాల్గొన్నారు.

విద్యాధరిక్షేత్రంలో మూలానక్షత్ర పూజలు


లక్షపుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

వర్గల్,జూన్ 22: మూలానక్షత్రం సందర్భంగా శనివారం వర్గల్ విద్యాధరిక్షేత్రంలో కుంకుమార్చనలు, అక్షరాభ్యాసాలు, లక్షపుష్పార్చనలు, శ్రీదేవిసహస్రనామార్చన చేశారు. సరస్వతీఅమ్మవారి సన్నిధిలో ఉదయం ఆలయ వ్యవస్థాపక అధ్యక్ష,చైర్మన్ శ్రీయాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో విశేషపంచామృతాభిషేకం,యాగశాలలో చండీమంత్రహోమం నిర్వహించారు.రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు చర్యలు చేపట్టారు.

హిందూ వాహిని నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట టౌన్,జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర సంఘటక్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా హిందూ వాహిని నూతన కమిటీని శనివారం ఎనుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా బస్వరాజు సత్యం, ప్రధాన కార్యదర్శులుగా కిరణ్ కుమార్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌ను నియామకమయ్యారు. ప్రముఖ్,సహ ప్రముఖ్‌లను ప్రకటించారు.కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర కార్యదర్శి బత్తుల శివాజీ, రాష్ట్ర సంపర్క సహ ప్రముఖ్ కస్తూరి భూమిరెడ్డి,రాష్ట్ర బోధన సహప్రముఖ్ చల్ల బాల్‌రెడ్డి,కార్యాలయ సహ ప్రముఖ్ ఆకుల ప్రశాంత్,నిధి సహప్రముఖ్ విజేయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర


అమ్మవారి బాసికం తొలిగిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

హుస్నాబాద్, జూన్ 22: నెల రోజుల పాటు జరిగిన హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర శనివారం ముగిసింది. అమ్మవారికి బాసికం కట్టి కల్యాణంతో మొదలైన జాతర బాసికం తొలిగించడం ద్వారా ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ముగింపు సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గౌడ సంఘం నాయకులు, ఆలయ ధర్మకర్తలు, ఈవో కిషన్‌రావు, అర్చకులు పరమేశ్వరశర్మ ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్నారు. జాతర ముగిసినా ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాలతో పాటు ఇతర వారాల్లోనూ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు ఎల్లవేళలా వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవచ్చని అర్చకుడు పరమేశ్వరశర్మ తెలిపారు.

మర్పడగలో దుర్గామాతకు విశేషపూజలు

నవాహరణ హవనం నిర్వహిస్తున్న వేద పండితులు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 22 :కొండపాక మండలంలోని మర్పడగలోని విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి నవాహరణ హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామికి అభిషేకంతో పాటు దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, చీకోటి మల్లికార్జున్, రామచంద్రారెడ్డి, శ్రీశైలం, దేవసాని మల్లేశం, మర్యాల రవీందర్ పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం 95శాతం పూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట కలెక్టరేట్, జూన్22: గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం 95శాతం పూర్తయినందున డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు భూ సర్వే, పెగ్ మార్కింగ్‌ను జూలై10వ తేదీలోగా పూర్తి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట సమీకృత జిల్లా సముదాయంలో ఆయన కలెక్టర్ మనుచౌదరితో కలిసి గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంట పొలాలకు త్వరగా సాగునీరు సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు అక్కన్నపేట మండలంలో 132 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 235 ఎకరాలు, కోహెడ మండలంలో 304 ఎకరాల భూమి సర్వే, పెగ్ మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతం మత్స్యసంపదను ఇతర ప్రాంతాలకు పంపేలా చూడాలని జిల్లా మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ కరీంనగర్ శంకర్, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, సిద్దిపేట ఆర్డీవో సదానందం, హుస్నాబాద్ ఇరిగేషన్ డివిజన్ ఈఈ రాములు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌ను గొప్పగా తీర్చిదిద్దండి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూన్ 22: హుస్నాబాద్‌ను మరింత గొప్పగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ను సరికొత్తగా చూపించేందుకు అభివృద్ధి చేసుకోవాలనే తపనతో పనిచేస్తున్నామన్నారు. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర, కేంద్రమంత్రులు కృషిచేయాలని కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్‌భవనం, వెజ్, నాన్‌వెజ్ భవనం, ఎఫ్ఎస్‌టీపీ తదితర అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు ఇప్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్‌లో మున్సిపల్ నూతనకార్యాలయం, మాతాశిశు సంక్షేమ దవాఖాన, ఏసీపీ భవనాలు సైతం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఆమె వివరించారు. ఆరపల్లిలోని పల్లెచెరువు వద్ద మత్తడితో రాకపోకలు నిలిచిపోతున్నాయని బ్రిడ్జి నిర్మించాలని కౌన్సిలర్ మ్యాదరబోయిన శ్రీనివాస్ మంత్రిని కోరారు. ప్రధాన రహదారిపైనుంచి వచ్చే మురుగు కొత్తచెరువులో కలువకుండా నేరుగా వాగులోకి వెళ్లే విధంగా కాల్వ నిర్మించాలని కౌన్సిలర్‌వల్లపు రాజు, అద్దెకు ఉంటున్నవారి కుటుంబసభ్యులు మరణిస్తే వారు ఉండేందుకు చోటు లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా చెరువు వద్ద గదులు నిర్మించాలని కౌన్సిలర్ చిత్తారి పద్మ కోరారు. పట్టణానికి ప్రత్యేకంగా రింగ్‌రోడ్ నిర్మించాలని కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ 14వ వార్డు కౌన్సిలర్ భూక్యా సరోజన పలు సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్‌వైస్‌చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ

రైతుబంధు అందరికీ అందేలా చూడాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 22 : రైతుబంధు అందరికీ అందేలా చూడాలని.. నకిలీ విత్తనాలు అరికట్టాలని జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన 3వ(వ్యవసాయం), 2వ (గ్రామీణాభివృద్ధి), 4వ(విద్యా,వైద్యం) స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకొని టీకాలు వేయించాలన్నారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించాలని, ఎక్కడైనా సమస్య ఉంటే సమన్వయంతో పరిష్కరించాలన్నారు. జిల్లాలో బడిబాట ఏ విధంగా జరిగింది.. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు లక్ష్మి, యాదగిరి, కొండల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'పిక్ ప్యాకెట్' గ్యాంగ్‌ను పట్టుకున్న పోలీసులు

హుస్నాబాద్, జూన్ 22: ఇటీవల హుస్నాబాద్ ప్రాంతంలో జరిగిన పలు ర్యాలీలు, సభల్లో పిక్‌ప్యాకెట్ దొంగతనాలకు పాల్పడిన గ్యాంగ్‌ను హుస్నాబాద్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం హుస్నాబాద్ పీఎస్‌లో ఎస్సై తోట మహేశ్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఐదుగురు గ్యాంగ్‌గా ఏర్పడి జనం సందడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని పిక్‌ప్యాకెట్ చేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. అరెస్టు అయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ఇట్ట ఆంజనేయులు, ఇదే గ్రామానికి చెందిన దేవరకొండ దుర్గారావు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీరామ్ గోపి, భూపాలపల్లిలోని సుభాష్ కాలనీకి చెందిన రేవెల్లి రమేశ్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కంప నాని ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి కారు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.6వేల నగదును స్వాధీనం చేస్తున్నామన్నారు. ఈ ఐదుగురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్


మోతెలో బాధితులకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూన్ 22 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బైండ్ల శ్రీకాంత్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వ బీమా రూ. 2 లక్షల చెక్కును అతని భార్య బాల్‌లక్ష్మికి శనివారం ఎమ్మెల్యే అందజేశారు. అదే గ్రామానికి చెందిన గగ్గె యాదగిరి అనారోగ్యంతో బాధపడుతుండడంతో రూ.40 వేల ఎల్‌వోసీ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రంగాల్లో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, యాదగిరి పాల్గొన్నారు.

వెంకట్రావు పేటలో బియ్యం అందజేస్తున్న ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

ట్రాక్టర్ యూనియన్ చేయూత

తొగుట, జూన్ 22 : మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పాత్కుల ఎల్లవ్వ ఇటీవల మృతి చెందింది. శనివారం ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు బియ్యం అందజేశారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు రాములు, లక్ష్మణ్, ఎల్లం, భిక్షపతి, స్వామి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిపై కేంద్ర మంత్రులు చొరవ చూపాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

గజ్వేల్, జూన్ 22: కేంద్ర మంత్రులు తెలంగాణలోని సింగరేణిని కాపాడే ప్రయత్నం చేయాలని, అప్పుడే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిన వాళ్లుగా ఉంటారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కళ్యాణ్‌కర్ నర్సింగరావు అన్నారు. శనివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిని కాపాడకపోతే జాతికి ద్రోహం తలపెట్టిన వారమవుతారన్నారు. కేంద్ర మంత్రులైన బండి సంజయ్, కిషన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. ఫ్రీజోన్ అంశానికి తెలంగాణ ఉద్యమం ఊపిరి పోసిందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అయినప్పుడు సింగరేణి తెలంగాణ ప్రజల హక్కు అన్నారు. తెలంగాణ ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, అందుకు సింగరేణి హక్కు కోసం కేంద్రంపై పోరాటం చేయాలన్నారు. పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కాంగ్రెస్, బీజేపీలకు దక్కిందని, అందుకు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో నాయకులు ఉమార్, నవాజ్, మల్లేశం, స్వామి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మర్పడగలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 22 : కొండపాక మండలంలోని మర్పడగలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలా థామస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచిత మందులు, వైద్య పరీక్షలు చేరాలనే ఉద్దేశంతో గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాల విద్యార్థులు గ్రామంలో ఐదుగురిని దత్తత తీసుకొని వారికి సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మంచాల అనసూయాకనకరాములు, తహసీల్దార్ దిలీప్‌నాయక్, మండల వైద్యాధికారి శ్రీధర్, మర్పడగ ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

పైన నిర్మాణం.. కింద తరగతులు

పైన జరుగుతున్న నిర్మాణ పనులు (ఇన్‌సెట్లో) కింద విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, జూన్ 22 : విద్యార్థుల రక్షణను గాలికొదిలేసి.. ఓ వైపు నిర్మాణం జరుగుతుండగానే పాఠశాలను నడిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఇటీవల నూతన భవనంలోకి మార్చారు. కానీ అక్కడ భవనం పూర్తి కాకముందే పాఠశాల తరగతులను ప్రారంభించారు. పైన అంతస్తుల్లో పనులు జరుగుతుండగానే ప్రమాదకర రీతిలో కింద విద్యార్థులకు తరగతులు నడిపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తుంది. అదే విధంగా పాఠశాల పూర్తిగా రోడ్డుపైనే ఉండటంతో ట్రాఫిక్ సైతం ఇబ్బందులు కలుగుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్22: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుండడం బాధాకరమని, ఇది మంచి పరిణామం కాదన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో పేదలకు చదువు దూరం కానుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డియాదగిరి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

సిద్దిపేట, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డియాదగిరి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకున్నా, మద్యాన్ని ఏరులైపారించేందుకు ఎక్సైజ్‌శాఖకు మంత్రిని నియమించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల పాఠశాలలను ప్రారంభించి నాణ్యమైన విద్యను అందిస్తే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం అవగాహన లేకుండా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాలికలకు మోటార్ వాహనాలు అందిస్తామని ఇచ్చిన డిమాండ్ ఏమైందని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం నియోజకవర్గ సమన్వయకర్త శ్యామ్, పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు గుజ్జరాజు, రవి, శ్రీకాంత్, నరేశ్, నాయకులు మధు, మాధవ్, శ్రావణ్‌గౌడ్, వంశీ, బాలకృష్ణ, పోతుల నరేశ్, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్,జూన్ 22 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం శనివారం జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ ఎంపీడీవో చౌరస్తా,రాజీవ్ రహదారి పైన పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 25 మందిని పట్టుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు వారిని న్యాయమూర్తి శ్రావణి ముందు హాజరుపర్చగా విచారణ జరిపి మందు బాబులకు రూ. 14,100 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

చేర్యాల, జూన్ 22 : పట్టణంలోని పెద్దమ్మగడ్డ ప్రాథమిక పాఠశాలలో శనివారం అదే పాఠశాలలో పని చేసే గణిత ఉపాధ్యాయుడు రాకేశ్‌రెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు హెచ్ఎం నాగమణి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని, వారికి పాఠశాల సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శిరీష, ఎమ్మార్పీఎస్-టీఎస్ నాయకుడు భూమిగారి రాజేందర్, భాగ్య పాల్గొన్నారు.

25న ఇసుక డంపుల వేలం

మిరుదొడ్డి, జూన్ 22 : మిరుదొడ్డి టోన్‌లో అక్రమంగా నాగయ్య వాగు నుంచి ఇసుక తరలించి డంపు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు వారం క్రితం డంపులను మిరుదొడ్డి , టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. శనివారం ఎస్సై పరశురాములు ఇసుక డంపులను మిరుదొడ్డి తహసీల్దార్ గోవర్ధనకు అప్పగించారు. ఈ నెల 25వ తేదీన పట్టుకున్న ఇసుకను వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

గజ్వేల్, జూన్ 22: మల్లన్నసాగర్‌లో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని లక్ష్మాపూర్ గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా శనివారం గ్రామానికి చెందిన లక్ష్మణ్, కనకరాజు, నవీన్‌కుమార్, మల్లేశం, విజయ్, రాజు, కృష్ణ, కరుణాకర్, నరేశ్, పరశురాములు స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమకు అన్యాయం జరిగిందని, రావాల్సిన ప్యాకేజీలు వెంటనే ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నేటికీ చాలా మంది తాత్కాలిక ఇండ్లలోనే నివాసం ఉంటున్నారని, గజ్వేల్‌కు చెందిన లబ్ధిదారులు ఖాళీ చేయాలని ఒత్తిడి తేవడంతో ఇబ్బందిగా మారుతుందన్నారు. తమకు పూర్తిస్థాయిలో ప్యాకేజీలు వచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తామన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

గజ్వేల్, జూన్ 22: అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు కార్బన్ డయాక్సైడ్, పెట్రోల్, డీజిల్ ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఏబీసీని, ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాలకు డ్రై కెమికల్ పౌడర్‌ను వినియోగించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, అగ్ని మాపక సిబ్బంది చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నంగునూరు, జూన్ 22 : జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూనియర్ కాలేజీలు ప్రారంభమై 22 రోజులు గడుస్తున్నా ప్పటివరకు విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. టెన్త్ పాసైన విద్యార్థులందరికీ రూ.10 వేలు ఇస్తానని ఎన్నికల హామీలో చెప్పిన విధంగా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, నాయకులు భిక్షపతి నాయక్, శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.